# 19వ వార్డులో జనసేన మహా సంకల్పయాత్ర



**అమలాపురం, మేజర్ న్యూస్ :** పట్టణంలోని 19వ వార్డులో మహాసంకల్ప యాత్ర 90వ రోజు కార్యక్రమం జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి చిక్కాల సతీష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ ఇంచార్జి శెట్టిబత్తుల రాజబాబు రెండు చోట్ల జనసేన జెండా స్తూపాలను ఆవిష్కరణ చేశారు.తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చాలా చోట్ల నీరాజనాలు, హారతులు, శాలువాలతో సత్కరించారు. మేళతాళాలతో మొదలుపెట్టి కార్ల కాన్వాయ్‌తో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుని జనసేనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆశేష జనవాహినితో సంకల్ప యాత్ర విజయవంతంగా జరిగింది. రాష్ట్ర జిల్లా నాయకులు, జనసేన నాయకులు, వీర మహిళలు, యువకులు, పెద్దలు దాదాపు 1000 మందితో జరిగినది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు మహదశ నాగేశ్వరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి శ్రీనుబాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి చిక్కం భీముడు, మున్సిపల్ కౌన్సిలర్ గండి దేవి, హారిక, గొలకోటి విజయలక్ష్మి, జనసేన నాయకులు గండి స్వామి, సూదా చిన్న, ఆకుల బుజ్జి, పిండి రాజా, తూము రమేష్, అర్లపల్లి దుర్గ, గుమ్మళ్ళ తాతయ్య కాపు, మోకా బాలయోగి, వీర మహిళలు పాల్గొన్నారు.


సూర్య
నేటి దినపత్రిక
17వ వసంతంలోకి
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,2 ఫిబ్రవరి 2024








# గోల్డ్ స్మగ్లింగ్

- మూలాలు కాకినాడలో
- భీమవరం పోలీసుల అదుపులో 10 మంది క్యారియర్లు
- స్మగ్లింగ్ సూత్రధారుడిగా సతీష్ గుర్తింపు
- ప్రత్యేకంగా 'కూలీలను' ఏర్పాటు చేసుకుని దందా
- వ్యవస్థీకృతంగా సాగుతున్న అక్రమ రవాణా
- కిలోకు రూ.6 లక్షలు లాభం
- 6 .96 కిలోల బంగారం, రూ.49,970 నగదు స్వాధీనం
- తదుపరి విచారణే కేసుకు కీలకం

మన దేశంలో బంగారాన్ని ఎక్కువగా ప్రేమిస్తూ ఉంటారు. దాదాపుగా ప్రతిఒక్కరు కూడా బంగారంపై మక్కువతో ఎక్కువగా కొనుగోలు చేసే ప్రయత్నం చేస్తారు. ప్రతి పండుగకు ఏదో ఒక బంగారు ఆభరణం, ఏదో ఒక నగ చేయించు కోవడం ఆనవాయితీగా మారింది. అయితే బంగా రం ధరలు షాకిస్తున్నాయి. వరుసగా బంగారం పెరుగుతూనే ఉంది. దీంతో బంగారం స్మగ్లింగ్‌ను ఆదాయ వనరుగా మార్చుకున్నారు కొందరు అక్రమార్కులు.. దీనిలో ప్రముఖ మాఫియా కింగ్ డాన్ దావూద్ ఇబ్రహీం కూడా ఒకరు. అంతటి వ్యక్తి కాకపోయినా...అలాంటి లక్షణాలతో కాకినాడ దేవాలయం వీధిలో నివసించే కోట్లకు పడగలెత్తిన సతీష్ అనే బంగారం స్మగ్లింగ్ డాన్ మూలాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి.భీమవరంలో పోలీసులు వలపన్ని కాగితాలు లేని 6.96 కిలోల బంగారంతో పట్టుకున్న 10క్యూలీలు (క్యారీయర్లు) ఇతని జీతగాళ్ళుగా ఉన్నారని విశ్వసనీయ సమాచారం. ఈ కాకినాడ బంగారం స్మగ్లింగ్ డాన్ సతీష్ గతంలో ఒకసారి పట్టుబడ్డాడని, తిరిగి కొన్నిరోజుల క్రితం అధిక మొత్తం నగదు తరలిస్తూ చిక్కాడని డిఆర్ఐ అధికారుల వద్ద వున్న సమాచారం.. ఒక కేజీ బంగారం దొంగ రవాణా విజయవంతమైతే అన్ని ఖర్చులూ పోనూ స్మగ్లర్లకు రూ.6లక్షలలాభంఉంటున్నట్లు తెలుస్తోంది . దీంతో 40 మంది కూలీలతో వందల కేజీల బంగారాన్ని కాకినాడ సతీష్ స్మగ్లింగ్ చేస్తున్నట్లు సమాచారం. దేశ సమగ్రతకు ఇటువంటి చీడపురుగులు హానికరమని డిఆర్ఐ స్థాయి అధికారులు ఏరిపారేయాలని ప్రజలు కోరుతున్నా రు.. కాకినాడ బంగారం స్మగ్లింగ్ డాన్ దందాపై సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశీలనాత్మక కథనం..

సూర్య బ్యూరో ఉమ్మడి గోదావరి జిల్లాలు

బంగారం అక్రమ రవాణాకు పాల్పడిన 10 మంది క్యారియర్లను భీమవరం పోలీసులు గురువారం ఉదయం అరెస్టు చేసి వారివద్ద నుంచి 6.96 కేజీల కాగితాలు లేని బంగారం, రూ.49,970 నగదు స్వాధీనం చేసుకున్నారు. భీమవరం టూటౌన్ సిఐ శ్రీనివాస్, జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌కి రాబడిన సమాచారం మేరకు ఈ నిందితులను అరెస్టు చేశారని తెలుస్తోంది. నిందితుల వివరాలు ఇలా వున్నాయి. చిలకల సాయికిరణ్ కోరుకొండ, కోళ్ళ వెంకట కాంతారావు, వంకా వెంకటేష్, గొడు పైడిరాజు, అవిడి హేమంత్ వినయ్, బండి వాసు, దాసరి గణేష్, గూన వీరవెంకటరమణలు రాజమండ్రి, చిలకల అరవింద్, బొక్కా వీరసాయి లు కోరుకొండకు చెందినవారు. వీరంతా కాకినాడ బంగారం స్మగ్లింగ్ డాన్ సతీష్ వద్ద జీతగాళ్ళుగా పని చేస్తున్నట్లు చెబుతున్నారు. వీరికి ఖర్చులకు డబ్బులు ఇచ్చి ఎక్కడికి వెళ్ళాలి.. ఎలా వెళ్ళాలి.. ఎవరిని కలవాలి...ఎక్కడ బంగారం ఇస్తారు ఎలా తెవాలి అన్నది ప్రతీది చెప్పి ప్రతి క్యారీయర్ కి 600 గ్రాముల బంగారం ఇచ్చి లోదుస్తుల్లో దాచి తీసుకువచ్చేలా శిక్షణ ఇవ్వడంతో ... పోలీసుల కు దొరికిన క్యారియర్‌లకు అలవాటుగా మారినట్లు చెబుతున్నారు. ఇలా ప్రతీ నెల ఒక్కొక్క టీం మూడుసార్లు 30 కేజీల బంగారం ఇలా అక్రమ రవాణా ద్వారా చేరవేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తున్న సమాచారం. ఇలా 4 ముఠాలను ఏర్పాటు చేసి అతి పెద్ద బంగారం స్మగ్లింగ్ రాకెట్‌ను సతీష్ నడుపుతున్నట్లు, ఇతనికి అన్ని నగరాల్లోని బడా బడా వ్యాపారులు పరిచయం అవ్వడంతో వారికి నేరుగా తక్కువకి బంగారం సప్లయి చేస్తున్నట్లు తెలుస్తోంది.

అయితే రోజురోజుకు బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో అక్రమ రవాణా గణనీయంగా పెరుగుతోంది. అయితే భీమవరం పోలీసులు ఇక్కడితో కేసును వదిలేస్తారా లేక దొరికిన క్యారియర్‌లతో నిజాలు కక్కించి అతిపెద్ద బంగారం స్మగ్లింగ్ రాకెట్‌ను చేధిస్తారో వేచి చూద్దాం.

## లోకేష్ ఫౌండేషన్‌లో పేదలకు భోజన వితరణ



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న జనార్ధన్ కేరేజ్ ద్వారా గురువారం 632వ రోజు పేదలకు భోజన వితరణ జరిగింది. సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత వైద్యులు డాక్టర్ సురేంద్ర జన్మదిన శుభ సందర్భంగా నారా లోకేష్ యువజన ఫౌండేషన్ పార్టీ ఆఫీసులో ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెరుకూరి సాయిరామ్ వర్మ ఏర్పాటు చేసిన భోజనాలు అధ్యక్షుడు మండపాక సుబ్బు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండపాక సుబ్బు మాట్లాడుతూ డాక్టర్ సురేంద్రబాబు బాలకృష్ణకు స్నేహితులే కాకుండా వ్యక్తిగత వ్యక్తిగత వైద్యునిగా ఉంటూ తెలుగుదేశం పార్టీకి, లోకేష్ యువజన ఫౌండేషన్‌కి చేస్తున్న సేవలు వెలగట్టలేనివన్నారు.

## ఉపాధ్యాయునిగా శిరోమణి విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దారు

– పదవీ విరమణ సభలోఎమ్మెల్సీ కుడుపూడి



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థినీ విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తారని, పదవి విరమణ చేస్తున్న శిరోమణి ఉత్తమ ఉపాధ్యాయునిగా మంచి సేవలు అందించారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్య నారాయణరావు అన్నారు. శ్రీ గోపాలకృష్ణ గోఖలే పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాలలో శిరోమణి ఉపాధ్యాయురాలు శిరోమణి పదవీ విరమణ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్ర మణి మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయునిగా పలుమార్లు శిరోమణి ఎంపికయ్యారని ఆమె అన్నారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం పలువురు శిరోమణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాసిన అనంతకుమార్, కుడుపూడి సత్య శైలజ, కుడుపూడి భాగ్యలక్ష్మి, మట్టపర్తి నాగేంద్ర, సత్తి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ శిక్షణ తరగతులు



**అమలాపురం, మేజర్ న్యూస్ :** నియోజకవర్గం అమలాపురం పట్టణంలో మెట్ల రమణబాబు గారి స్వగృహము నందు క్లస్టర్ ఇంచార్జ్ పెచ్చేట్టి విజయలక్ష్మి, మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో 4,5వ క్లస్టర్‌వారీగా ఇంటిగ్రెటెడ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అమలాపురం అసెంబ్లీ టీడీపీ ఇంచార్జ్ మాజీ శాసన సభ్యులు అయితాబత్తుల ఆనందరావు అతిగా పాల్గొని మాట్లాడుతూ శిక్షణ కోసం వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తిక్కరెడ్డి నేతాజీ, కర్రి రామస్వామి, మాకిరెడ్డి పూర్ణిమ, బొర్ర వెంకటేశ్వరరావు, చిక్కాల రాంబాబు, అబ్బిరెడ్డి చంటి,భాస్కర్ల రామకృష్ణ, కొంచె వెంకన్న, కన్నబాబు, వలవల శివరావు, యూనిట్ ఇన్చార్జులు వార్డు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ దుర్మార్గాలను తరిమికొట్టాలి



**అమలాపురం, మేజర్‌న్యూస్ :** బీసీలకు రాజకీయ పదవుల్లో సైతం రిజర్వేషన్ కల్పించిన టీడీపీ–జనసేన ప్రభుత్వాన్ని గెలిపించాలని ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం జైహో బీసీ సభలో టీడీపీ అమలాపురం పార్లమెంటు ఇన్చార్జ్ హరీష్ బాలయోగి మరియు మాజీ శాసనసభ్యులు దాట్ల బుచ్చిబాబు పిలుపునిచ్చారు. బీసీలకు రాజకీయ పదవుల్లో 24 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావుదే అని తెలుగుదేశం పార్టీ అమలాపురం పార్లమెంటు ఇన్చార్జ్ హరీష్ బాలయోగి గుర్తు చేశారు. దీనికి మరింత బలం చేకూర్చుతూ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచి, మరింత ప్రాధాన్యత కల్పించిన విజనరీ నాయకుడు నారా చంద్రబాబునాయుడు అని కొనియాడారు. అయితే.. వైసీపీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా మార్చిందని విమర్శించారు. బీసీలపై అక్రమ కేసులు, అన్యాయపు చేష్టలతో అరాచకాలు సృష్టిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టేందుకు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం లో గురువారం జరిగిన జైహో బీసీ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువతకు ఉపాధి కల్పించే కార్పొరేషన్ రుణాలను నిలిపివేసి, బీసీలకు స్వయం సాధికారతను దూరం చేశారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం తమ తప్పులు గ్రహించి, బడుగు, బలహీనవర్గాలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుగా చిత్తుగా తరిమి కొడతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు - వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ
- పాల్గొన్న కమిషనర్ నాగనరసింహారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు







**ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలుచేస్తున్నారని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ శాసనసభ్యులుకురసాల కన్నబాబు పేర్కొన్నారు.కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని 47,48,49,50 డివిజన్లకు సంబంధించి వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంగా గురువారం సాయంత్రం జరిగింది.ఈసందర్భంగా స్వయం సహాయక సంఘాలకు వైఎస్ఆర్ ఆసరా ద్వారా విడుదలైన మెగాచెక్‌ను ఎమ్మెల్యే కన్నబాబు విడుదల చేశారు. కమిషనర్ నాగనరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ప్రతీమహిళాఆర్థికాభివృద్ధి సాధించాలన్నదే లక్ష్యమన్నారు. ఇందులో భాగంగానే అనేక సంక్షేమ ఫలాలను మహిళల పేరుతో ఇస్తున్నామన్నారు. ప్రభుత్వపథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని, కుటుంబ పోషణలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు.నగరపాలక సంస్థ కమిషనర్ సి.హెచ్. నాగనరసింహారావు మాట్లాడుతూ 47 నుంచి 50వ డివిజన్ వరకు నాలుగు డివిజన్ల పరిధిలోని 268 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి నాల్గవ విడత ఆసరా సొమ్ముద్వారారూ.1.88కోట్లు విడుదలవుతోందన్నారు.ఇచ్చిననిధులనుమహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, పార్టీ నాయకులు కడియాల చిన్న, రాజారపు వెంకట లక్ష్మి, ఐ.శ్రీను, పలువురు నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## 3న ఇనోదయాలో పిల్లలకు ఉచిత వినికిడి పరీక్షలు

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఇనోదయ హాస్పిటల్‌లో ఈ నెల 3వ తేదీన డా. డి.ఎన్.ఎస్.ప్రకాష్ ఆధ్వర్యంలో పిల్లలకు వినికిడి పరీక్షలను ఉచితంగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్‌మేనేజింగ్ డైరెక్టర్ డా.జి. రామ్మోహన్, సిఇఒలావణ్యలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారుమీపిల్లలకు శబ్దాలకు స్పందిం చడం లేదా, వయస్సుకు తగ్గట్టు మాట్లాడ్డం లేదా, మాటలలో స్పష్టత తక్కువగా ఉన్నట్లు మీకు అనిపిస్తోందా, అయితే తల్లిదండ్రులు ఈ క్యాంప్‌లో పాల్గొని వైద్యసేవలు పొందవల్సిందిగా వారు విజ్ఞప్తి చేసారు. ఈ ఉచిత వైద్య శిబిరం ఉదయం 9గం. నుండి మధ్యాహ్నం 2గం. వరకు నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులందరూ సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు 9908833303లో సంప్రదించవచ్చన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్షా సమావేశం



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో గురువారం పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. నరసింహానాయక్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మార్చి 3వ తేదీన జరగబోవు పోలియో నిర్మూలనా కార్యక్రమం నేపథ్యంలో ప్రజలందరూ,0–5 సంవత్సరములలోపు తమపిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డా. జె. నరశింహానాయక్ నాయక్ కోరారు. జిల్లాలో మొత్తం ఒక లక్ష ఎనభైఎనిమిది వేల (1,88,000) మంది 5 సంవత్సరముల లోపు పిల్లలు ఉన్నారని ప్రజలందరూ అప్పుడే పుట్టిన బిడ్డనుండి5 సంవత్స రముల లోపు పిల్లలందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ స్థాపనకు కృషిచేయాలని అన్నారు. ప్రతీ 250 మంది పిల్లలకు ఒక బూత్ చొప్పున 1336 బూత్‌లు ఏర్పాటు చేస్తామని, 2672 టీములు పాల్గొంటాయని తెలిపారు.

ఈ కార్యక్రమము మొదటి రోజున పోలియో చుక్కల కేంద్రాలలో పోలియో చుక్కలు వేస్తారని, చుక్కలు వేయించుకోకుండా ఎవరైనా మిగిలి ఉంటే తర్వాత రెండు, మూడు రోజులలో అనగా 04.03.2024 మరియు 05.03.2024 తేదీలలో వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్ళి పోలియో చుక్కలు వేస్తారని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జె. నరశింహానాయక్ నాయక్ మాట్లాడుతూ గతంలో పోలియో చుక్కలు వేయించినా ఈ చుక్కలు అదనంగా వేయించి పిల్లలకు అంగవైకల్యం రాకుండా కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.జాన్ జూడే జాషువా, ఎస్ఎమ్ఓ, డబ్యూహెచ్ఓ, వైజాగ్, డా. కె.రత్నకుమార్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డావి.అరుణ, మెడికల్ ఆఫీసర్, ఆర్‌సిహెచ్ & ఎమ్‌సిహెచ్ నోడల్ అధికారిబి.విజయలక్ష్మి గణాంఖాధికారి,కె.సూర్యచంద్రరావు డిప్యూటీ డెమో మరియు గిరి గణేష్, డిఎస్ఓ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీసులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరంలో పోలీసులు ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహీన్ సిన్హా ఆదేశాలు మేరకు రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లి ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సహకారంతో రంపచోడవరం పోలీస్ స్టేషన్ వద్ద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సబ్ డివిజన్ పరిధిలోని 10 పోలీస్ స్టేషన్లు నుంచి పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ఆటో యూనియన్ డ్రైవర్లు రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మొత్తం 32 మంది రక్తదానం చేసారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సిఐ వాసా వెంకటేశ్వరావు, రంపచోడవరం ఎస్ఐ ఎం.మోహన్ కుమార్, ఎడిషనల్ ఎస్ఐ సత్యసాయి, సిబ్బంది పాల్గొన్నారు.

# పైడా కళాశాలలో చట్టాలపై అవగాహన



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ సతీష్ కుమార్ ఆదేశాలు మేరకు కాకినాడ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో కాకినాడ పైడా కాలేజ్ నెహ్రూ యువకేంద్ర విద్యార్థులకు రహదారి భద్రత మరియు ట్రాఫిక్ రూల్స్ మీద అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకత, కార్లు వంటి వాహనాలకు సీట్ బెల్ట్ ఆవశ్యకత, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌ల మీద అవగాహన కల్పించారు. ఇందులో ట్రాఫిక్ 1 & 2 ఇన్స్పెక్టర్లు ఎన్. రమేష్, డీఎస్. చైతన్య కృష్ణ, ట్రాఫిక్ ఎస్సైలు కిషోర్ కుమార్, యేసు బాబు, వెంకటరత్నం మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాకినాడలో వారసత్వ సంపదను రక్షించుకోవాలి

**- పురాతన కట్టడాలను కాపాడుకోవాలి**
**- నగరానికి పొంచి ఉన్న పర్యావరణ ముప్పు**
**- రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్ర సింగ్ వెల్లడి**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ నగరంలో ఉన్న పురాతన సంపదను రక్షించుకోవాలని, అలాగే పురాతన కట్టడాలను కాపాడుకోవాలని, కరువు వరదలు నివారణ ప్రపంచ ప్రజా కమిషన్ చైర్మన్, రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత డాక్టర్ రాజేంద్రసింగ్ వెల్లడించారు. కాకినాడ నగరం ప్రస్తుతం ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కాకినాడలోని కాస్మోపాలిటన్ క్లబ్‌లో వారసత్వ సంపద సంరక్షణపై చర్చను పిడబ్ల్యూసిడిఎఫ్ కో-ఆర్డినేటర్ ప్రెసింగి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ వారసత్వ సంపద సంరక్షణపై రాజేంద్ర సింగ్ విలేకరులకు వివరాలను వెల్లడించారు. కాకినాడలోని వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద సమాజం మొత్తానికి చెందుతుందని వీటిని పరిరక్షించుకొని భవిష్యత్ తరాలకు అందజేయాలన్నారు. వారసత్వ సంపదలో పకృతి వనరులు, మడ అడవులు, హెూప్ ఐలాండ్, తూర్పు తీర ప్రాంతం పర్యావరణం అన్నీ కూడా భాగమేనని, ఆ సంపద ప్రజల ఆస్తి అని చెప్పారు. కాకినాడలోని చారిత్రాత్మక గల ఎంఎస్ఎన్ చారిటీస్ భూములను, ఆస్తులను కొల్లగొట్టాలని చూస్తున్నారని అది తనకు చాలా బాధాకరంగా ఉందన్నారు. పూర్వ కట్టడాలను, ఆస్తులను కాపాడవలసిన వారే వాటిని అన్యాక్రాంత పరుస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ నగరంలో ఉన్న ఎంఎస్ఎన్ చారిటీస్, పెద్ద మార్కెట్, పిఆర్ కళాశాల, మెక్లారిన్ పాఠశాల, కోస్తా తీర ప్రాంతాలను కాపాడుకోవాలంటూ హితవు పలికారు. కొన్ని ట్రస్టులు ఆయా సంపదకు రక్షణగా నిలుస్తు న్నాయని, కానీ ఆ ఆస్తులు కాపాడవలసిన దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్వీర్యం చేస్తుందంటూ చెప్పారు. పౌర సమాజం బలంగా ఉంటేనే వారసత్వ సంపద, పురాతన కట్టడాలను కాపాడుకోవచ్చని, అలాగే పేదరికం నుండి పేదలను విముక్తి కలిగించాల్సిన ట్రస్టులే పేదరికంలోకి కూరుకుపోతు న్నాయంటూ రాజేంద్రసింగ్ చెప్పారు. రాజేంద్ర సింగ్ హిందీలో చేసిన వ్యాఖ్యలను పర్యావరణ సామాజికవేత్త బొలిశెట్టి సత్యనారాయణ తెలుగులోకి అనువదించారు.



అంతకుముందు వారసత్వ సంపద సంరక్షణపై కాకినాడకు చెందిన పలువురు నుండి సలహాలు సూచనలు తీసుకొని వాటిపై చర్చించారు. ఈ చర్చ కార్యక్రమంలో జేఎన్టీయూకె ప్రొఫెసర్లు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, సామాజికవేత్తలు చిక్కాల దొరబాబు, పి.శివశంకర్, టీకే విశ్వేశ్వర్‌రెడ్డి, కే.మృత్యుంజయరావు, ఐ.దోసగిరిరావు, గూడూరు వెంకటేశ్వరరావు, వక్కలంక రామకృష్ణ, చిక్కాల అబ్బు నందమూరి వినోద్, ఉద్దండ రాజ్యలక్ష్మి, జి సత్యమూర్తి, మల్లాడి రాజు, పప్పు దుర్గా రమేష్, ఎండి జవహర్ ఆలీ, కిషోర్ కుమార్, దూసర్లపూడి రమణరాజు, విబిఎల్ఎన్ మూర్తి, బి.వి.రమణ మూర్తి, వైదాడి నూకరాజు, కొప్పనాతి శ్రీనివాసరావు, ఆకుల ప్రవీణ్, ఏపీజే విను, పోలసపల్లి సరోజ, పెద్దింశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాకినాడలో ఉన్న వారసత్వ సంపదను పురాతన కట్టడాలను రక్షించేందుకు కలసికట్టుగా పయనించాలని తీర్మానించారు. అలాగే కాకినాడ చరిత్రకు సంబంధించి వారి దగ్గర ఉన్న బుక్‌లెట్లను పలువురు రాజేంద్ర సింగ్‌కు అందించారు.

## జెఎన్టీయుకెలో 'వారసత్వ సంపద రక్షణ'కై ఇంటరాక్టివ్ సెషన్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్‌టియుకె ప్రాంగణంలో గురువారం యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) మరియు ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీ (ఐఎస్‌టి) అధ్యాపకులు, విద్యార్థులుతో 'వారసత్వ సంపద రక్షణ'కై ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. జెఎన్‌టియుకె జంగిల్ బుక్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడిఎల్) డైరెక్టర్ ప్రొ.కెవిఎస్‌జి.మురళీకృష్ణ అధ్యక్షత వహించగా ప్రపంచ ప్రజా కమీషన్ ఛైర్మన్ మరియు రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డా.రాజేంద్ర సింగ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ కాకినాడ నగరంలోని పురాతన సంపదను, పురాతన కట్టడాలను సంరక్షించుకోవాల్సిన ఆవశ్యతక ఎంతైనా ఉందన్నారు. వారసత్వ సంపదలో ప్రకృతి వనరులు, మడ అడవులు, హోప్ ఐలాండ్, తీర ప్రాంతాలన్నీ పర్యావరణంలో భాగం అని, అవి ప్రజల సందప అని పేర్కొన్నారు. రాజస్థాన్ నీటి కొరత, గంగా ప్రక్షాళన, నీటి లభ్యతను అంచనా వేయడం, జోర్డాన్ జలాలకు సంబంధించిన సిరియా సంక్షోభం, భూమిలోని నీటిని సంరక్షించడంలో విద్యార్థుల పాత్ర గురించి వివరించారు. ఐక్యరాజ్యసమితి ప్రతినిధిగా ఆరు సార్లు సిరియాలో సందర్శించిన తన అనుభవాలను వెల్లడించారు. ఇంటరాక్టివ్ సెషన్‌లో భాగంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చి పలు అంశాలను వివరించారు. అనంతరం రామన్ మెగసెసె అవార్డు గ్రహీత డా.రాజేంద్ర సింగ్‌ని యూనివర్శిటీ అధికారులు తదితరులు మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌టి డైరెక్టర్ ప్రొ.ఏ.గోపాలకృష్ణ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ నిపుణులు డా.సత్యాజీరావు, పర్యావరణవేత్త సత్య, మాజీ మేయర్ సరోజ, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతీ సంప్రదాయం వారసత్వ సంపదకు గోపురం

**- పౌర సంక్షేమ సంఘం**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కరువు మరియు వరదల నివారణ ప్రపంచ ప్రజా కమీషన్ ఆధ్వర్యాన డాక్టర్ రాజేంద్ర సింగ్ ముఖ్య అతిథిగా బోలిశెట్టి సత్యనారాయణ శివశంకర్ నిర్వహణలో ప్రెసింగి ఆదినారాయణ నిర్వహించిన కాకినాడ వారసత్వ సంపద సంరక్షణపై జరిగిన చర్చా కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు పాల్గొన్నా రు. ఈ సందర్భంగా రమణరాజు మాట్లాడుతూ ఆలయ గోపురంగా సంస్కృతీ సంప్రదాయ వైభవమైన ప్రాచీన సంపదను పర్యావరణాన్ని కాపాడుకుంటేనే లోకకళ్యాణం కొనసాగుతుందని పేర్కొన్నారు. కోరంగి అభయారణ్యం, చాళుక్య కుమారరామ భీమేశ్వర స్వామి ఆలయం, బిక్కవోలు ఆలయాలు, ఓడరేవు, కలెక్టర్ బంగ్లా, తహశీల్దార్ కార్యాలయం, రంగూన్ మేడ, హెూప్ ఐలాండ్, బ్రహ్మోపాసన మందిరం, విక్టోరియా వాటర్ వర్క్స్ భవనం, కొడవలి తురకల కొండ, బౌద్ధ ఆరామం, పిఆర్ కాలేజీ, ఎంఎస్ఎన్ చార్టీస్, జగన్నాథపురం పాత వంతెన మున్నగు ప్రాచీన అంశాలను తన ప్రసంగంలో ఉదహరించారు. ప్రజలను చైతన్యం చేసే దిశగా ముందడుగు వేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# రైళ్లలో నేరాలపై అవగాహన



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రైళ్లలో జరిగే నేరాలు, అవ్వాంచనీయ సంఘటనలపై వ్యాపారులకు క్రిందిస్తాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, రాజమండ్రీ డీఎస్పీ ల ఉత్తర్వుల మేరకు సామర్లకోట రైల్వే స్టేషన్లో రైల్వే భద్రత కోసం, ప్రయానంలో జరిగే ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు, రాళ్లు రువ్వడం, రైళ్లలో గంజాయి, మద్యం నిషేధిత వస్తువులు, మండే వస్తువులను రవాణా చెయ్యడం వంటి వాటిపై రైల్వే స్టేషన్లో పలు వ్యాపారాలు నిర్వహించే వారికి, హ్యాకర్ లకు రైల్వే ఎస్ ఐ బి లోవరాజు అవగాహన కల్పించారు. అలాంటి సంఘటనలు స్టేషన్లో ఎక్కడ జరిగినా సమాచారం అందించాలన్నారు. ప్రయానీకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన భాద్యత మనందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దాపురం ఎంపిడిఓగా ఉషారాణి బాధ్యతలు స్వీకరణ



**పెద్దాపురంరూరల్, మేజర్ న్యూస్:** పెద్దాపురం ఎంపిడిఓగా ఎం.ఉషా రాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఎన్నికల బదిలీ లలో భాగంగా అల్లూరి సీతరామారాజు జిల్లా దుంబ్రిగూడ ఎంపిడ ిఓగా పనిచేస్తూ ఉషారాణి పెద్దాపురం రావడం జరిగింది.

ఈ సందర్భంగా ఆమెను మండల పరిషత్ కార్యాలయ సూపరిం టెండెంట్ ఎం.సత్యనారాయణమూర్తి, ఇఓ & పిఆర్‌డి కె.రాజ శేఖర్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీలు ఆమెను మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ జగన్నాధరావు, పంచాయతీ సెక్రటరీలు నక్కా సత్యనారాయణ మూర్తి, శ్యామలా దేవి, కళావతి, భారతి, ఎన్.టి.రమేష్‌బాబు, వీరబ్రహ్మం, త్సలికి దొరబాబు, ఎండి.సుభాని, జ్యోతుల పద్మరాజు, వి.శ్రీనివాసరావు, బషీర్, ఈశ్వరరావు, భార్గవ్, నిర్మలాదేవి, శ్రీదేవి, ఎల్.వి.లక్ష్మీ, కార్యాలయ సిబ్బంది సుధాకర్, తలాటం శ్రీరామ్, రోజా, మహేష్, తదితరులు ఉన్నారు.

ఇప్పటివరకు ఇక్కడ ఎంపిడిఓగా విధులు నిర్వహించిన బత్తిన అశోక్ కుమార్ ఏలూరు జిల్లా మండల పరిషత్ ఎంపిడిఓగా వెళ్ళడం జరిగింది.

# అంధుల జీవితాలలో అద్భుత దృష్టి - వైడిఆర్





**కాకినాడ, మేజర్ న్యూస్ :** అంధత్వంతో బాధపడుతున్న చిన్నారులకు దృష్టితో పాటు ఎదుటి వారిని గుర్తించేందుకు సందేశాన్ని అందించి దృష్టినిచ్చే ప్రత్యేక కళ్ళజోళ్ళను చిన్నారులకు అందించడం ద్వారా వారి జీవితాలకు కొత్త ఆశలను అందించిన ఘనత బిపిసి సంస్థకు దక్కుతుందని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ వై.డి.రామారావు అన్నారు. రెడ్‌క్రాస్ పూర్వ విద్యార్థులకు ఈ పరికరాన్ని పంపిణీ చేయడం ద్వారా ఎంతో మేలు చేసారని, చెన్నయ్ రోటరి క్లబ్ మరియు బిపిసి ప్రతినిధులకు ధన్యవాదాలు తెలుపుకున్నారు. భారతదేశంలో బెంగళూరు కేంద్రంగా బ్రెయిలీ భాష ఆధారిత కృత్రిమ మేధతో పనిచేసే విలువైన కళ్ళజోళ్ళను భారత పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసి) ఆర్థిక సహకారంతో స్థానిక రెడ్‌క్రాస్ అంధుల పాఠశాల పూర్వ విద్యార్థులకు సుమారు రూ.8.50లక్షల విలువ చేసే కళ్ళజోళ్ళను 27 మందికి అందజేయడం జరిగిందని వైడిఆర్ చెప్పారు. రెడ్‌క్రాస్ అంధుల పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చెన్నయ్ తూర్పు రోటరి క్లబ్ దృష్టి కార్యక్రమంలో భాగంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. చెన్నయ్ రోటరి క్లబ్ దృష్టి కార్యక్రమ కమిటి ప్రత్యేక ప్రతినిధి రమణ్ కుమార్ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ ఆధారంగా ఈ కళ్ళజోడును ధరించడం వలన ఎదుటివారిని మరియు వస్తువులను గుర్తించడానికి, పుస్తకాలు చదవడానికి, ప్రయాణం చేసే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలు వంటి అనేక సదుపాయాలు అంధులు పొందగలరని, ఇది వారి జీవితాలలో వెలుగు నింపుతుందని ఆయన చెప్పారు. రెడ్‌క్రాస్ అంధుల పాఠశాలలో వారి సంక్షేమానికి ఛైర్మన్ వైడిఆర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకునే కార్యక్రమాలను తాము పరిశీలించామని, ఈ ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించాలన్న ఆలోచనతో తమ మిత్ర బృందం సహకారంతో విద్యార్థులకు అందించామని చెప్పారు. అంధ విద్యార్థులకు పి.ఆర్ కాలేజి విశ్రాంత ప్రిన్సిపాల్ భరతలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఎస్.హెచ్.జి టెక్నాలజీ ప్రతినిధులు ఇబ్రహీం మరియు విజయ్ ఈ కళ్ళజోడుల వాడకంపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రోటరి గోల్డెన్ జూబ్లి క్లబ్ అధ్యక్షులు నరహరిశెట్టి రవికృష్ణ, డా.ముత్తా నవీన్, జి.కె.శ్రీనివాస్, రోటరి అసిస్టెంట్ గవర్నర్ ఉదయభాను, ప్రసాదరెడ్డి, డా.కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో జెఎన్‌టియుకె విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి చెద్దాం

**- ఉపకులపతి ప్రొ.జి.వి.ఆర్.ప్రసాదరాజు**




**కాకినాడ, మేజర్ న్యూస్ :** అందరి సమిష్టి కృషితో జెఎన్‌టియుకె విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఉపకులపతి ప్రొ.జి.వి.ఆర్.ప్రసాదరాజు పిలుపునిచ్చారు. జెఎన్‌టియుకె కాకినాడ విశ్వవిద్యాలయ పదవ స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం అలూమ్ని ఆడిటోరియం నందు జెఎన్‌టియుకె డైరెక్టర్‌లు, టీచింగ్ & నాన్ టీచింగ్ సిబ్బందితో నిర్వహించిన సక్సెస్ మీట్ కార్యక్రమానికి ఉపకులపతి ప్రొ.జి.వి.ఆర్.ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రిజిస్ట్రార్ ప్రొ.ఎల్.సుమలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డిఇ ప్రొ.బి.బాలకృష్ణ, డిఏపి ప్రొ.కె.వెంకటరెడ్డి, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ. ఎం.హెచ్.ఎం.కృష్ణప్రసాద్‌లు వేదికనలంకరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ.జి.వి.ఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ జెఎన్‌టియుకె 10వ స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేసిన అధికారి స్థాయి నుండి సిబ్బంది వరకు ప్రతీ ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ స్నాతకోత్సవానికి ఛాన్సలర్ హోదాలో పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకట శేషాచారి, గౌరవ డాక్టరేట్ అందుకున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ & సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న లకు, గౌరవ అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపిఎస్‌సిహెచ్‌ఇ) ఛైర్మన్ ప్రొ.కె.హేమచంద్రారెడ్డి, జిల్లా ఉన్నతాధికారులకు, యూనివర్శిటీ పాలక మండలి సభ్యులకు, విద్యావేత్తలకు, జెఎన్‌టియుకె సిబ్బందికి, ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అందరి సమిష్టి కృషితో జెఎన్‌టియుకె విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అతిత్వరలో జెఎన్‌టియుకె స్నాతకోత్సవ భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని, అలాగే రోడ్లు, డ్రైన్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, స్పెషల్ ఆఫీసర్లు, యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, టీచింగ్ మరియు నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి కౌన్సిలర్ నక్క లలిత మృతి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మున్సిపాలిటీ 26వ వార్డు కౌన్సిలర్ నక్కా లలిత(37) గురువారం ఉదయం మృతి చెందారు. ఆమె మృతికి పెద్దాపురం నియోజక వర్గ వైఎస్ఆర్సీపీ ఇంచార్జి దవులూరి దొరబాబు, రాష్ట్ర కార్మిక నాయకులు, వైసీపీ సీనియర్ నాయకులు దవులూరి సుబ్బారావు లు, మున్సిపల్ కౌన్సిల్ తీవ్ర సంతాపాన్ని తెలిపారు. ఇటీవల కొంత అనారోగ్యంతో కౌన్సిలర్ లలిత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ క్రమంలో ఆమె గురువారం మృతి చెందారు. దానితో ఆమె పార్థీవ దేహాన్ని వైసీపీ ఇంచార్జి దొరబాబు, నాయకులు సుబ్బారావు లతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, గోకిన సునేత్రాదేవి, మున్సిపల్ కమిషనర్ జె రామారావు, అందరు కౌన్సిలర్ లు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే బుధవారం సాయంత్రం స్థానిక అంబటి వారి తోటలో మృతి చెందిన రిటైర్డ్ హెచ్ ఎం మట్టపల్లి వెంకట రావు మృతికి ఇంచార్జి దొరబాబు, నాయకులు సుబ్బారావు లు కుటుంబాన్ని సందర్శించి భౌతిక ఖాయం వద్ద నివాళి అర్పించారు. ఇంకా ఈ కార్యక్రమాల్లో పలు పార్టీలకు చెందిన నాయకులు, కౌన్సిలర్ లు, పట్టణ ప్రముఖులు పాల్గొని మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

# సెర్ప్ సిబ్బంది సమ్మె తాత్కాలిక వాయిదా



రంపచోడవరం, మేజర్ న్యూస్ : సెర్ప్ (వెలుగు) సిబ్బంది సమ్మె తాత్కాలికంగా వాయిదా వేసినట్లు గురువారం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులందరూ జనవరి 23 నుండి వారి సమస్యలు పరిష్కారం కోసం సమ్మె చేయడం ప్రారంభించారు. కాగా జనవరి 31వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ టు గవర్నమెంట్ పిఆర్ అండ్ ఆర్ డి డిపార్ట్‌మెంట్, సెర్ప్ ముఖ్య కార్య నిర్వహణాధికారులు చర్చించి సెర్ప్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి హామీ ఇవ్వడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న సెర్ప్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరణ కొరకు నియమించబడిన మంత్రివర్గ సబ్ కమిటీ ద్వారా సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి తద్వారా సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేస్తూ పే స్కేలు అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఆర్థికశాఖ ఇచ్చిన శాంక్షన్ పోస్టులు మెమో ను జిఓ రూపంలో ఇవ్వాలని సెర్ప్ ఉద్యోగులు కోరుతున్నారు. అలాగే సమ్మె కాలాన్ని స్పెషల్ సెలవుగా పరిగణిస్తూ పూర్తి వేతనం ఇవ్వాలని వారు అభ్యర్థించారు. హెచ్ఆర్ఎ పాతవిధానంలో కొనసాగింపు లేక కొత్త జిఓ ప్రకారం ఇవ్వాలని కోరుతున్నారు. జిఓ 25 ప్రకారం మరణించిన కుటుంబాలకు రూ.2 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని కోరుతున్నారు. మిగిలిన సమస్యలు పరిష్కారించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిర్ణీత కాలవ్యవధిలో సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 1వ తేదీ నుండి సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని ప్రకటించారు.

## కాంప్లెక్స్ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి

**- అధికారులకు భక్తుల విన్నపాలు**
**- బస్సులు ఎక్కుతుండగా చోరీకి గురవుతున్న ఫోన్లు, విలువైన ఆభరణాలు**




**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నందు శ్రీ స్వామివారి సన్నిధికి వచ్చే భక్తులు ప్రతిరోజు అధిక సంఖ్యలో వస్తూ ఉంటారు. అయితే, ఇదే అదనుగా దొంగలు భక్తుల వద్ద నుండి బస్సులు ఎక్కుతున్నప్పుడు ఫోన్లు, విలువైన ఆభరణాలు చోరీ చేస్తుండటంతో పలువురు భక్తులు లబోదిబోమంటున్నారు. తాజాగా గురువారం ఆర్టిసి కాంప్లెక్స్‌లో ఓ భక్తుడు బస్సు ఎక్కుతుండగా బస్సు డోర్ కి అడ్డంగా నలుగురు వ్యక్తులు నిల్చుని ఉన్నారు, ఆ వ్యక్తి వాళ్లని తప్పించుకుని లోపలికి వెళ్తుండగా జేబులో ఉన్న ఫోను దొంగలించారు. ఆ వ్యక్తి లోపలికి వెళ్ళిన తర్వాత తన మొబైల్ లేకపోవడంతో అన్నవరంలో పాత బస్టాండ్ దగ్గర దిగి మళ్ళీ కాంప్లెక్స్‌కు వెళ్లి అక్కడ చూడగా ఎవరూ కనపడక పోలీస్ స్టేషన్‌కి వెళ్లి తన మొబైల్ పోయిందని కంప్లైంట్ ఇచ్చాడు. ఇలా ఎన్నోసార్లు కాంప్లెక్స్ లో ఫోన్లు పోవడం జరిగాయి. పలువురు భక్తులు ఇదే తరహాలో తమ ఫోన్లు, ఆభరణాలు చోరీకి గురవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంప్లెక్స్‌లో సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల దొంగలు రెచ్చిపోతున్నారని, తాము డబ్బులు, విలువైన ఆభరణాలు, సెల్ ఫోన్లు పోగొట్టుకుంటున్నామని పలువురు భక్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, ఆలయానికి వచ్చే భక్తులను దొంగల బారి నుండి కాపాడాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన చోటుచేసుకున్నట్లు కొత్తపేట ఎస్సై డి.జ్వాలా సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు గ్రామానికి చెందిన చీమల మాధవరావు తన తండ్రి నరసింహారావు కలిసి తన ద్విచక్ర వాహనంపై వాడపాలెం గ్రామంలో తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి తన ఇంటికి వెళ్తుండగా పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలానికి చెందిన ఆటో డ్రైవర్ బండి మోషే తన ఆటోతో పలివెల వైపు వస్తుండగా మార్గమధ్యలో చౌదరిపురం సత్తెమ్మ తల్లి గుడి సమీపంలో ఎదురెదురుగా వచ్చి బలంగా ఢీకొనడం జరిగింది. దీంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మాధవరావు(43)ఆటోపై వస్తున్న మోషే(35) ఇరువురు సంఘటన స్థలంలోనే మృతి చెందారు. నరసింహారావుకు బలమైన గాయాలు తగలడంతో మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంకు తరలించారు. సంఘటన ప్రాంతాన్ని ఎస్.ఐ పరిశీలించి మృతదేహాలను పంచనామా నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పోగొట్టుకున్న ఫోన్‌ను అందచేసిన సచివాలయం కార్యదర్శి



**– అభినందించిన సిఐ కృష్ణ భగవాన్**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను యజమానికి అందచేసిన సచివాలయం పరిపాలనా కార్యదర్శి ని కాకినాడ 3 వ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ కృష్ణ భగవాన్ అభినందించారు. కాకినాడకు చెందిన కంప చేతన్ తన శామ్సంగ్ గెలాక్సీ ఎఫ్ 22 మోడల్ మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. కాకినాడ సుభాష్ రోడ్ –1 సచివాలయం పరిపాలనా కార్యదర్శి బత్తుల నరేష్ కుమార్ రాత్రి 8 గంటలకు మెయిన్ రోడ్‌లో ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రోడ్డు మీద మొబైల్ ఫోన్ కనిపించింది. అది తీసి ఎవరైనా ఫోన్ చేస్తారని ఎదురు చూసి, వివరాలు వాట్సప్ గ్రూప్‌లలో పోస్ట్ చేశారు. కొంత సేపటికి యజమాని ఫోన్ చేయగా ఆయన వద్ద వివరాలు తీసుకుని గురువారం వార్డ్ పరిపాలనా కార్యదర్శి నరేష్, వార్డ్ మహిళా సంరక్షణ కార్యదర్శి కొడాలి కీర్తి , వాలంటీర్ టి.హేమ గోపాల్ కృష్ణలు సిఐ కృష్ణ భగవాన్ చేతుల మీదుగా యజమానికి ఫోన్‌ను అందచేశారు.

## సామర్లకోట ఎంపీడీవోగా ఎస్.డి.శ్యామ్ సుందర్



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విశాఖ జిల్లా చోడవరం ఎంపీడీవో పనిచేస్తున్న ఎస్ డి శ్యాంసుందర్ గురువారం సాయంత్రం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీడీవోగా పని చేసిన డి శ్రీ లలిత పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు ఎంపీడీవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సామర్లకోట మండల పరిషత్ అధ్యక్షులు బొబ్బరాడ సత్తిబాబు ను మర్యాదపూర్వకంగా కలిశారు మండల పరిషత్ ఈ ఓ పి ఆర్ డి సత్య రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ సిబ్బంది పూలమాల వేసి ఎంపీడీవో శ్యాంసుందర్ కు స్వాగతం పలికారు.

# మహిళా సాధికారతకు సీఎం పెద్దపీట

**– మంత్రి తానేటి వనిత**

**దేవరపల్లి, మేజర్ న్యూస్ :** దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి జగనన్న మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారని హెూంమంత్రి, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. గురువారం గోపాలపురం నియోజకవర్గంలోని గోపాలపురం, దేవరపల్లి మండలాల వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల కార్యక్రమం దేవరపల్లి అంబటి సత్యనారాయణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాతూ గోపాలపురం మండలంలో 1267 గ్రూప్ లకుగాను 12,467 మంది డ్వాక్రా మహిళలకు 10 కోట్ల 8 లక్షల రూపాయలు అలాగే దేవరపల్లి మండలంలో 1663 గ్రూప్ లకుగాను 16,630 మంది డ్వాక్రా మహిళలకు 15 కోట్ల 33 లక్షల రూపాయల చెక్ ను. మొత్తం నాలుగు విడతల్లో గోపాలపురం మండలానికి 40 కోట్ల 31 లక్షలు, దేవరపల్లి మండలానికి 61 కోట్ల 32 లక్షల రూపాయలను కేవలం డ్వాక్రా మహిళలకు వైయస్సార్ ఆసరా పథకం కింద ఇవ్వడం జరిగిందని ఆమె తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయనన్ని సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్నారన్నారని మహిళా సాధికారతకు కృషి చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఆడపడుచుకు పుట్టింటి కానుకగా ఇళ్ల స్థలాలను జగనన్న ప్రభుత్వం అందించిందని, 25 లక్షల ఇళ్ల స్థలాలు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి 32 లక్షల ఇళ్ల స్థలాలు ఉచితంగా పంపిణీ చేసి పేద ప్రజల పట్ల తన ఉదారతను చాటుకున్నారని, మన రాష్ట్రంలో జరిగిన మహిళా సాధికారిత మరే రాష్ట్రంలో జరగలేదన్నారు. రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థను



నిర్మూలించే విధంగా ప్రతి పిల్లవాడిని చదివించండి. మేనమామగా వారిని చదివించే బాధ్యతను నేను తీసుకుంటానని జగనన్న అనేక విద్యా సంస్కరణలు తీసుకొచ్చారని ఆమె తెలిపారు. ఒకటవ తరగతి నుండి డిగ్రీ చదివే విద్యార్థి వరకు ఉపయోగపడే విధంగా జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, మనబడి నాడు–నేడు, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిల్లల భవిష్యత్ కోసం ఆలోచనలు చేస్తు విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. గోరుముద్ద పథకం ద్వారా పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం దగ్గర నుండి మన బడి నాడు నేడు ద్వారా పిల్లలకు కార్పొరేట్ విద్యను చేరువ చేశారన్నారు. విద్యాకానుక ద్వారా బుక్స్, యూనిఫాం, షూస్ వంటి వస్తువులు కూడా అందించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుందన్నారు. ప్రభుత్వానికి ఎటువంటి ఆదాయం లేని కరోనా సమయంలో కూడా ప్రజా సంక్షేమం ఆపలేదని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం, సంక్షేమ క్యాలెండర్ ను ముందుగానే ప్రకటించి సంక్షేమం అందజేస్తున్నామన్నారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం వంటి పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ఆర్థికంగా వెనుకబడిన అన్ని కులాల మహిళలకు నేరుగా లబ్ధి చేకూర్చారన్నారు. జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో రాష్ట్రంలో పేదరికం 12% నుండి ఆరు శాతానికి తగ్గిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి జగనన్న చెప్పాడంటే చేస్తాడంతే అవునా కాదా అంటూ డ్వాక్రా మహిళలను ప్రశ్నించగా సభా ప్రాంగణంలో ఉన్న డ్వాక్రా మహిళలు చేస్తాడు, చేస్తాడు అంటూ సభాప్రాంగణమంతా హెూరెత్తించారు. రాబోయే రోజుల్లో మన ప్రభుత్వాన్ని మనస్పూర్తిగా జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసి ప్రజా సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగడానికి మీరందరూ ఆశీర్వదించాలని హెూంమంత్రి తానేటి వనిత కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దన్ రావు, దేవరపల్లి గోపాలపురం ఎంపిపిలు కె వి కె. దుర్గారావు, ఉండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ కడిమి వీర కుమారి, మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, నరహరిశెట్టి రాజేంద్ర బాబు, జిల్లా అధికార ప్రతినిధి గడ జగదీష్, కుసులూరి సతీష్, ఎంపీటీసీ సత్తి జగదీశ్వర్ రెడ్డి, సత్తి సాయి ఈశ్వర్ రెడ్డి, పత్సా రాంగోపాల్, గోపాలపురం వైసిపి నాయకులు వెలగా శ్రీరామమూర్తి, సాలి వేణు, ద్వారకా తిరుమల ట్రస్ట్ బోర్డ్ మెంబర్ ఆచంట అనసూయ, మండల బిసి మహిళా అధ్యక్షులు కడలి హైమావతి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### పురపాలక సంఘంలో మొదటి రోజు 86 శాతం ఫించన్లు పంపిణి

**– కమీషనర్ కె.వి.పద్మావతి**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘంలో ఫిబ్రవరి నెలకు సంబంధించి మొదటి రోజు గురువారం 14 సచివాలయాల పరిధిలో వలంటీర్ల ద్వారా 86శాతం ఫించన్లు పంపిణీ చేయడం జరిగినట్లు మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ పురపాలక సంఘ పరిధిలో 6253 ఫించన్లకు గాను మొదటి రోజు 5377 ఫించన్లు వలంటీర్ల ద్వారా అందజేయడం జరిగిందని ఆమె తెలిపారు. మిగత ఫించన్లు త్వరితగతిన ఫించనుదారులకు అందజేయాలని వలంటీర్లకు సూచించడం జరిగిందని కమీషనర్ తెలిపారు.

## ఆలయంలో చోరీ



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** కొవ్వూరు గోదావరి గట్టు వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో దొంగలు పడి హుండీని దొంగిలించుకుని వెళ్లిపోయినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం బుధవారం తెల్లవారు జామున గుడి తలుపులు తాళాలు బద్దలు కొట్టి దేవాలయంలో ప్రవేశించినట్లు తెలిపారు. సిసి కెమెరాలు ఆధారంగా ఇద్దరు వ్యక్తులు దేవాలయాలకు ప్రవేశించి ఈ దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. హుండీని దేవాలయ ప్రాంగణంలోకి తీసుకువెళ్లి తాళాలు బద్దలు కొట్టి నగదును దొంగిలించుకుపోయినట్టు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సిహెచ్. బాబురావు తెలిపారు.

### గొల్లప్రోలు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రవికుమార్



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా టి.రవికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు గొల్లప్రోలు కమిషనర్‌గా పనిచేసిన మోర్ముర్తి సత్యనారాయణ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీ అయిన విషయం తెలిసిందే. సత్యనారాయణ స్థానంలో గొల్లప్రోలు కమిషన్ గా నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ కార్యాలయంలో సెక్రటరీగా పనిచేస్తున్న రవికుమార్ ను గొల్లప్రోలు కమిషనర్‌గా అధికారులు నియమించారు. ఈ నేపథ్యంలో రవి కుమార్ గొల్లప్రోలు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. గొల్లప్రోలు కమిషనర్‌గా నియమితులైన రవికుమార్ ను నగర పంచాయతీ మేనేజర్ రాంప్రసాద్, జేఈఓ పద్మజ్యోతి, ఆర్ఐ కెపిపి వదన్ సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్ కార్యాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు. కాగా నగర పంచాయతీలో పలు వర్కులకు సంబంధించి డమ్మీ చైర్మన్గా వ్యవహరిస్తున్న ఒక ప్రజా ప్రతినిధి భర్త కోటి రూపాయలకు పైగా స్వహాసేసినట్లు ఆరోపణ వినిపిస్తున్న నేపథ్యంలో మెజార్టీ కౌన్సిలర్లు సంధించిన ఏకాస్త్రంపై నూతన కమిషనర్‌కు ఇక్కట్లు తప్పేలా లేవని పలువురు భావిస్తున్నారు.

### రాజవొమ్మంగి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎన్.సన్యాసినాయుడు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** జిల్లాలోని రంపచోడవరం డివిజన్ రాజవొమ్మంగి సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా ఎన్.సన్యాసినాయుడు గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా కోటపాడు గ్రామానికి చెందిన సన్యాసినాయుడు 2009 బ్యాచ్‌కు చెందినవారు కాగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని యు.కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం, తిమ్మాపురం, రంగంపేట స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. అలానే విజయవాడలో పనిచేయడం జరిగింది. అల్లూరి జిల్లా పాడేరు దిశ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడసర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించిన అల్లు స్వామి నాయుడు బదిలీపై వెళ్లారు. సర్కిల్ పరిధిలోని గంజాయి పంట పండించినా, ట్రాన్స్పోర్ట్‌కు సహకరించినా, సారాయి కాయడం, క్రయ విక్రయాలు నిర్వహించినా ఎంతటి వారినైనా చట్టపరంగా శిక్షించడం తప్పదని ఆయన హెచ్చరించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు వివిధ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని ఆయన కోరారు. సబ్ ఇన్స్పెక్టర్లు ఎస్ వెంకయ్య, టి.రఘునాథరావులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ సన్యాసినాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. అలానే స్థానిక సిబ్బంది సిఐని కలిసి అభినందించారు.

### మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్ సమస్యలపై వినతిపత్రం ఇచ్చిన యూనియన్ ప్రతినిధులు



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ప్రతినిధులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ కు తాడేపల్లిలోని ఆయన కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను వారు ఆయనకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి ఫీల్డ్ అసిస్టెంట్లు చెప్పిన సమస్యలను తీసుకువెళ్తానని వారితో చెప్పారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మేడిది పరంధామయ్య, ప్రధానకార్యదర్శి బి. నరసింహులు, కోశాధికారి యస్.ఖాదర్ భాషా, మునియ్య, ఇ.ఆదిశేషుకుమార్ ఇతర జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

## అద్భుతమైన ప్రదర్శనలతో సూపర్ జోడి రెండో ఎపిసోడ్




**– ఈ ఆదివారం రాత్రి 9 గంటలకు, మీ జీ తెలుగులో..!**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** తెలుగు టెలివిజన్ రంగంలో తిరుగులేని ఛానల్గా రాణిస్తున్న జీ తెలుగు ప్రారంభించిన సరికొత్త నాన్ఫిక్షన్ షో సూపర్ జోడీ. సెలబ్రిటీ డ్యాన్స్ రియాలిటీ షోగా ఘనంగా లాంచ్ చేసిన ఈ షో మొదటి మెగా లాంచ్ ఎపిసోడ్ అభిమానులను ఎంతగానో అలరించింది. మరిన్ని అద్భుత ప్రదర్శనలతో రెండో ఎపిసోడ్ తో సూపర్ జోడీ షో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రతి ఆదివారం అదిరిపోయే ఎపిసోడ్లతో అలరించేందుకు సిద్ధమవుతున్న సూపర్ జోడీ రెండో ఎపిసోడ్ ఫిబ్రవరి 04న, ఆదివారం రాత్రి 9 గంటలకు జీ తెలుగులో మాత్రమే..!

గత ఆదివారం ప్రసారమైన సూపర్ జోడీ మొదటి ఎపిసోడ్ నవ్వులు, భావోద్వేగాలు, అదిరిపోయే ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించింది. ఫిబ్రవరి 4న రాత్రి 9 గంటలకు ప్రసారం కానున్న రెండో ఎపిసోడ్ తో జీ తెలుగు ప్రేక్షకులను మరింత ఉర్రూతలూగించనుంది. మొదటి ఎపిసోడ్ లాగే రెండో ఎపిసోడ్ కూడా ప్రతిభ, అందం, వినోదం సమ్మేళనంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేస్తోంది. ఈ సెలబ్రిటీ డాన్స్ షో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టి బుల్లితెరపై సంచలనంగా మారింది. ఎవరీన్ యాంకర్ ఉదయ భాను వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ షోకి అందాల తారలు మీనా, శ్రీదేవి విజయ్ కుమార్తో పాటు ప్రముఖ కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. వినోదభరితంగా సాగిన మొదటి ఎపిసోడ్లో నలుగురు డైనమిక్ సెలబ్రిటీ జోడీలు మేఘన – మహేష్, శ్రీ సత్య– సంకేత్, మున్నా–హర్షల మరియు కరమ్ డాలీ తమ అద్భుతమైన ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యంలో ముంచెత్తిన ఈ జోడీల ఆకట్టుకునే ప్రదర్శనలు సూపర్ జోడీ షో రానున్న ఎపిసోడ్లకి ప్రతీకగా నిలిచాయి.

ఇక, 'ఆపరేషన్ వాలెంటైన్' ప్రమోషన్ లో భాగంగా సూపర్ జోడీ గ్రాండ్ లాంచ్కి మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ ముఖ్య అతిథిగా హాజరై మరింత గ్లామర్ జోడించారు. ఈ ఎపిసోడ్ కొనసాగింపుగా ప్రసారం కానున్న రెండో ఎపిసోడ్లో మరో నాలుగు సెలబ్రిటీ జోడీలైన తనూజ–కృష్ణ, పింకీ–శివ, అంజనా– సంతోష్, దిలీప్–యష్మి ఆకట్టుకునే ప్రదర్శనలతో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వనున్నారు. టాలీవుడ్ హీరో సందీప్ కిషన్ భాగం కానున్న సూపర్ జోడీ రెండో ఎపిసోడ్ని చూసేందుకు మీరూ సిద్ధంకండి..!

## మహిళాభ్యున్నతే ధ్యేయంగా - మహిళలకు నాల్గవ విడత ఆసరా

**ముఖ్య అతిథిగా పాల్గొన్న వైసిపి ఇన్‌చార్జి 'దవులూరి' – సిఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో మహిళాభ్యున్నతే ధ్యేయంగా మహిళలకు నాల్గవ విడత ఆసరా విడుదల చేసిన మహిళల పక్షపాతి సిఎం జగన్మోహన్‌రెడ్డి అని పెద్దాపురం వైసిపి ఇన్‌చార్జి దవులూరి దొరబాబు అన్నారు. పెద్దాపురం పట్టణంలో నాల్గవ విడత ఆసరా సంబరాల కార్యక్రమం స్థానిక లూథరన్ హైస్కూల్‌లో మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దవులూరి దొరబాబు పాల్గొని మాట్లాడుతూ ప్రతీ మహిళ లక్షాధికారి కావాలన్నదే జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో వైయస్సార్ ఆసరా ద్వారా రాష్ట్రంలోని మహిళా సంఘ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్నది జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వమని తెలిపారు. మెప్మా పిడి బత్తుల ప్రియంవద మాట్లాడుతూ వైయస్సార్ ఆసరా డబ్బులను మహిళా సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె తెలిపారు. అనంతరం సభనుద్దేశించి మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, రెండవ వైస్‌ఛైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మీలు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో కులం, రాజకీయం, వర్గం, మతం, చూడకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కిందని తెలిపారు. మెప్మా సిఎంఎం భ్రమరాంబ తెలుపుతూ పెద్దాపురం పురపాలక సంఘంలో 714 సంఘాలకు గాను 6950 మంది గ్రూప్ సభ్యులకు 5కోట్ల 95 లక్షల 63వేల 182 లు 4వ విడత వైయస్సార్ ఆసరా డబ్బులు రావడం జరిగిందని, ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కరరావు, విడదాసరి రాజా, నీలంశెట్టి అమ్మాజీ శ్రీనివాస్ (పండు), తాటికొండ వెంకటలక్ష్మీ పెదకాపు, బొబ్బిలి వీరవెంకట దుర్గా, పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, సిఓలు శ్రీదేవి, ఉమా పార్వతి, ఆర్‌పిలు ఆసరా లబ్దిదారులు, పెద్ద ఎత్తున మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అనంతరం వైయస్సార్ ఆసరా నమూనా చెక్‌ను దవులూరి దొరబాబు చేతుల మీదుగా అందజేశారు. దీనికి ముందుగా సిఎం జగన్ చిత్రపటానికి మహిళా సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు.

### దింపు కార్మికునికి రూ.54 వేలు ఆర్థిక సహాయం

**– గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ**



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ కమ్యూనిటీకి చెందిన దిడ్ల నర్సింహారావు కు 54 వేల రూపాయల ఆర్థిక సహాయన్ని సభ్యుల సమక్షంలో మానేపల్లి గ్రామ సర్పంచ్ మరియు ఎంపీటీసీ చేతులమీదుగా అందజేశామని సంస్థ అధ్యక్షులు కట్టా భాస్కర్ తెలియజేసారు. ఈయన గతంలో దింపుకార్మికుడు ప్రమాదావశత్తు ఒక కాలు మోకాలువరుకు రిమూవ్ చేయడం జరిగింది. అప్పటినుండి ఏ పని చేసుకోలేని పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులుతో బాధపడుచున్నవిషయాన్నీ అదే గ్రామానికి చెందిన గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సంస్థ సభ్యుడు దొమ్మేటి రామకృష్ణ ద్వారా సంస్థకు తెలియజేయడంతో వెంటనే స్పందించిన సభ్యులు విరాళాల సహాయంతో ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ అకౌంటెంట్ గుబ్బల శ్రీనివాస్, సభ్యులు కౌరు మునేశ్వరరావు కట్టా నాగమల్లేశ్వరరావు, కుక్కల రాము, చెల్లుబోయిన దుర్గాప్రసాద్, గుత్తుల మురళీకృష్ణ, కుడుపూడి వెంకటదుర్గ ప్రసాద్, కట్టా శ్రీను, కడలి రాంబాబు, దొమ్మేటి బద్రి మరియు స్థానికులు పాల్గొన్నారు.

### ఎంపీడీవోగా వాణి



కొత్తపేట, మేజర్ న్యూస్ : మండలం ఎంపీడీవోగా కందుల వాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం నుంచి ఎంపీడీవో వాణి బదిలీపై కొత్తపేట వచ్చారు. ఇంతవరకు పనిచేసిన ఎంపీడీవో మహేశ్వరరావు బదిలీపై వెళ్లారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు జరిగాయి. ప్రజల సహకారంతో ప్రజా అవసరాల మేరకు సేవలందిస్తానని ఎంపీడీవో వాణి తెలిపారు. కొత్తపేట ఎంపీడీవో ఆఫీస్ పాలనాధికారి హరికృష్ణ రెడ్డి, సిబ్బంది తదితరులు ఆమెకు స్వాగతం పలికారు.

## మున్సిపల్ కార్మికులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**– ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కాలనీ ఏర్పాటుకు ప్రజలు మద్దతు అవసరమని, ఏపి మున్సిపల్ అట్సోస్సోర్సింగ్ కార్మికుల డిమాండ్ సాధనకై చేబట్టిన సమ్మెలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేసారు. పిఠాపురం మున్సిపల్ వర్బ్ యూనియన్ గౌరవ అధ్యక్షులు సాకా రామకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగిన సాధరణ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం జరుగుతున్నకార్మికుల ఇండ్ల స్థలాలు సమస్య పై కాకినాడ పిఠాపురం, రెల్లిపెద్ద లు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా తోకల ప్రసాద్ మాట్లాడుతూ... సమ్మె లో కార్మికులు సమస్యలు అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకుల స్పందనతో సమ్మె తాత్కాలిక వాయిదా వేసామని, నేటికీ కొన్ని జీవోలే ఇవ్వడం జరిగిందని, ఏవైతే జాయింట్ కమిటీ( జెఎసి) తో ఒప్పందం జరిగాయో.. ఆ డిమాండ్లు తక్షణమే అమలు చేయకపోతే ఎన్నికల ముందే సమ్మె కు వెళ్ళతామని హెచ్చరించారు. కార్మికులకు కాలనీ ఏర్పాటు చేయాలని ప్రధమ డిమాండ్లు లో ఒకటని అది తక్షణమే అమలు చేసి స్థానిక జగ్గయ్య చెరువులో 257 సర్వే నెం 84 సెంట్లుభూమిని కబ్జా దారుల కోరలనుండి విడిపించి కార్మికులకు ఇవ్వాలని అన్నారు. అధికారులు కబ్జా దారులను ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని, కబ్జా అధికారులు అపడానికి వెనకాడుతున్నారంటే వారికి కూడా వాట ఉందని ఏఐటీయూసీగా భావించవలసి ఉంటుందని ఆయన మండిపడ్డారు. ఎన్నికల హడావుడి మొదలు కాముందే అధికారులు స్పందించి కార్మికులకు ఇండ్లస్థలంగా ప్రకటించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదురుగా దీక్షకు పిలిపునిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కేశవరపు అప్పల రాజు, ముత్యాల అప్పారావు, అల్లం పాపారావు తదితరులు పాల్గొన్నారు.